క్లుప్తంగా

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో



అడ్డపల్లి పాఠశాలలో తనిఖీలు చేస్తున్న ఎంఈవో-2 మల్లేశ్వరరావు

గంగవరం : పాఠశాలలో అభ్యసిస్తున్న పిల్లల ఆధార్ అనుసంధాన్ని సకాలంలో పూర్తి చేయాలని ఎంఈవో-2 టి.మల్లేశ్వరరావు ఉపాధ్యాయులను సూచించారు. అడ్డపల్లి చిన్నవీధి గిరిజన ప్రాథమిక పాఠశాలను ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లల ఆధార్ నమోదు, హాజరు, మధ్యాహ్నభోజన పథకం అమలును పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. జీపీఎస్ ప్రధానోపాధ్యాయురా లు సత్యవతి, సహ ఉపాధ్యాయిని వెంకటలక్ష్మి ఉన్నారు.

79 మందికి కంటి వైద్య పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

వై.రామవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం కాకినాడ అంజు కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 79 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఇందులో ఆపరేషన్‌లు అవసరమైన 18 మంది రోగులకు ఉచిత కంటి ఆపరేషన్లు కాకినాడ అంజు కంటి ఆస్పత్రి అంబులెన్స్‌లో తరలించారు. 35 మంది రోగులకు కళ్లద్దాలు పంపిణీకి రూ.700 నుంచి రూ.1100 వరకు రుసుమును ఆస్పత్రి సిబ్బంది వసూలు చేసినట్టు పలువురు రోగులు చెప్పారు. ఈ శిబిరంలో అంజు కంటి ఆస్పతి వైద్యాధికారి సాయి ప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



తడి.పొడి చెత్త బుట్టలను పంపిణీ చేస్తున్న సర్పంచ్, కార్యదర్శి

గూడెంకొత్తవీధి: తడి, పొడిచెత్తను వేర్వేరుగా వేయాలని రింతాడ పంచాయతీ సర్పంచ్ బొబ్బిలి లక్ష్మి, కార్యదర్శి అరుణ్‌కుమార్ కోరారు. వారు సోమవారం పంచాయతీ కార్యాలయంలో దుచ్చరిపాలెం గ్రామస్తులకు తడి, పొడి చెత్త బాక్స్‌లను పంపిణీ చేశారు.వారు మాట్లాడుతూ పరిశుభ్రత ప్రాముఖ్యతను వివరించారు. మాజీ సర్పంచ్ సాగిన పుష్పకుమారి, ఉప సర్పంచ్ మడపల సోమేష్, వార్డు సభ్యులు జోగిపడాల్, పీసా కమిటీ సభ్యుడు భీమేశ్వరరావు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రామకృష్ణ, ఎంపీటీసీ అప్పారావు

జి.మాడుగుల: మండలంలోని పాలమామిడి పంచాయతీ పరిధిలోని ఐదు గ్రామాల్లో జిల్లా ప్రజా పరిషత్ నిధులు రూ.25లక్షలతో చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణ పనులను సోమవారం మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సురభంగి రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు గెమ్మెలి అప్పారావు ప్రారంభించారు. సర్పంచ్ రామకృష్ణ మాట్లాడుతూ పాలమామిడి పంచాయతీ పరిధిలో గ్రామస్తులు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యను గతంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర దృష్టికి తీసుకెళ్లగా ఆమె సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేశారన్నారు. పాలమామిడి పంచాయతీ వనభంగిపాడు, వి.కొత్తూరు, ఏడుచావళ్ల, కొక్కిరాపల్లి కాలనీ, లక్కుళ్ల గ్రామాల్లో 100 మీటర్లు సీసీ డ్రైనేజీ పనులకు రూ.5లక్షలు చొప్పున రూ.25లక్షలు నిధులు మంజూరైనట్టు ఆయన తెలిపారు. డ్రైనేజీ పనులకు నిధులు మంజూరు చేసిన జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వైస్ సర్పంచ్ రామస్వామి, వార్డు సభ్యుడు కాసులమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు గణపతి, ప్రశాంత్, వార్డు మాజీ సభ్యుడు లింగన్నదొర, గ్రామపెద్దలు రామారావు, రామ్మూర్తి, చిన్నబ్బాయి, నూకాలమ్మ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వ్యవసాయ గొడౌన్ ప్రారంభం



గోడౌన్‌ను ప్రారంభిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే శిరీష

రాజవొమ్మంగి : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జడ్డంగిలో నిర్మించిన వ్యవసాయ గొడౌన్, ఎరువుల విక్రయ కేంద్రాన్ని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి సోమవారం ప్రారంభించారు.తాతారావు, ఎంపీటీసీ సభ్యులు పెద్దిరాజు, డింబకేశవరావు పాల్గొన్నారు.

సాగుకు సన్నద్ధం

- విస్తారంగా వరి సాగు
- రైతులకు సూచనలిస్తున్న అధికారులు
- పంటల పరిశీలనలో సిబ్బంది
- యాజమాన్య పద్ధతులతో మేలు



వరి నారు తీస్తున్న గిరిరైతులు

అరకులోయటౌన్: ప్రస్తుతం ఏజెన్సీలో వాతావరణం అనుకూలించడంతో వ్యవసాయం ఊపందుకుంది. గిరిరైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు వరితోపాటు చోడి(రాగులు), వాణిజ్య పంటల సాగు పనులు జోరుగా జరుగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో వరినాట్లు వేస్తున్నారు. వరి సాగులో తీసుకోవలసిన జాగ్రత్తలు, యాజమన్య పద్ధతులపై అరకులోయ వ్యవసాయశాఖ ఏడి వంగపీటి మోహన్‌రావు పలు సూచనలు, సలహాలు తెలియజేస్తున్నారు. వరి నారుమడుల్లో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, విత్తనాల ఎంపిక, భూమి చదును చేయడం, నేల స్వభావం, నీటి లభ్యత, విత్తనశుద్ధి, ఎరువుల మోతాదు తదితర అంశాలపై రైతులకు అవగాహన కలిస్తున్నారు. వరి సాగుకు ఆమ్ల, క్షార, చౌడు నేలలు తప్పా అన్ని రకాల నేలలు అనుకూలమేనని, నేల స్వభావాన్ని బట్టి ఎరువులను ఉపయోగించాలని సూచించారు. నీటి తడుపు అందించడం వంటివి చేయాలని చెబుతున్నారు. నీటి తడుపులు అధికంగా అవసరమైన నేలల్లో ఇతర పంటలు సాగు చేయడం రైతుకు లాభదాయకమని తెలియజేశారు.

జోరుగా వరినాట్లు

ఖరీఫ్‌లో అరకులోయ వ్యవసాయశాఖ సబ్‌డివిజన్ పరిధిలోని అనంతగిరి, అరకులోయ, డుంబ్రిగుడ, హుకుంపేట మండలాల్లో 14,986 హెక్టార్లలో కొంతమంది రైతులు వెదజల్లే పద్ధతిలో వరిసాగు



నాట్లు వేస్తున్న రైతు

చేస్తుండగా, మరి కొందరు నాట్లు వేసే పద్ధతిలో సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఈ క్రమంలోనే వరి నారులు తయారు చేసుకుంటున్నారు. ప్రాంతానికి అనుగుణంగా వ్యవసాయశాఖ అధికారులు విత్తనాలు పంపిణీకి చర్యలు చేపట్టారు. ఆర్‌జీఎల్(శ్రీకాకుళం సన్నాలు)-450 కింటాళ్లు, శ్రీధృతి రకం - 450 కింటాళ్లు వరి విత్తనాలు పంపిణీ చేశారు.

విత్తనశుద్ధి తప్పనిసరి

ఎకరానికి సరాసరిగా 15 నుంచి 20 కిలోల విత్తనం సరిపోతుంది. కిలో విత్తనానికి మూడు గ్రాముల కార్బండిజంను కలిపి ఆరబెట్టడం ద్వారా విత్తన శుద్ధి చేసుకోవాలి. విత్తనశుద్ధి చేసుకోవడంతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అనంతరం వాటిని నారుమడుల్లో చల్లుకోవాలని ఏడీ మోహన్‌రావు సూచించారు.

విత్తే సమయం కీలకం

మధ్యస్త, స్వల్పకాలిక విత్తన రకాలను ప్రస్తుత సీజన్ నుంచి జూలై నెలాఖరు వరకు నారు నాట్లు వేసుకోవచ్చు. ఆగస్టు నెలాఖరు వరకు ప్రధాన పొలాల్లో నాట్లు వేసుకోవాలి. ఈ సమయాల్లో నాట్లు వేయడం ద్వారా పంట దిగుబడి బాగుంటుంది. దీర్ఘకాలిక రకాలు సాగుచేయడంతో చీడపీడల ఉధృతి పెరగడమే కాక నీటి వృథా కూడా ఎక్కువ అవుతుంది.

నారుమడిలో తీసుకోవలసిన జాగ్రత్తలు

- నారు మడిలో రెండు క్వింటాళ్ల పశువుల ఎరువు లేదా వర్మీ కంపోస్ట్ వేసి రెండు లేదా మూడుసార్లు బాగా దమ్ము చేసి చదును చేయాలి.
- ఐదు సెంట్లు నారుమడిలో 1కిలో నత్రజని, రెండు కిలోల భాస్వరం, ఒక కిలో పోటాస్ వంటి ఎరువులను దుక్కిలో వేసుకోవాలి. విత్తనాలు వేసుకున్న 15 రోజుల తరువాత కిలో నత్రజనిని వేసుకోవాలి. నాట్లు ఆలస్యమైతే రెండో దఫా నత్రజని వేసుకోవచ్చు.
- విత్తనం చల్లిన తరువాత మొక్క దశలో పలచగా నీరుండాలి. మెట్ట నారు మడుల్లో ఇసుక ధాతువు లోపం అత్యధికంగా కనిపిస్తుంది. దీని నివారణకు, మొక్క ఎదుగుదలకు అనుగుణంగా ఒక గ్రాము ఉప్పును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- జింక్ ధాతువు లోపం నివారణకు జింక్ సల్ఫేట్ 2 గ్రాములు, లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- నారు మడిలో నారు తీయడానికి పది రోజుల ముందు కార్బోఫ్యూరన్ మూడు గుళికలు 400 గ్రాముల ఇసుకలో కలిపి పలచగా నీరుంచి చల్లుకోవాలి.
- సమగ్ర పోషక యాజమన్యం, సస్య రక్షణ ద్వారా నారును పెంచుకుంటే ప్రధాన పంట పొలంలో వచ్చే సమస్యలను అధిగమించవచ్చు.

అవగాహన అవసరం



రైతులు వాతావరణం అనుకూలంగా ఉండడంతో పంటల సాగుపై అవగాహణ పెంచుకోవాలి. ప్రస్తుత ఖరీఫ్‌లో విత్తన ఎంపిక, విత్తన శుద్ధి, నారుమడుల తయారీ, నాట్లు వేసే సమయంలోని మెలకువలు పాటిస్తే ఆశించిన పంట దిగుబడి సాధించవచ్చు. వ్యవసాయశాఖ సిబ్బంది సూచనలు ప్రకారం ఎరువులు అధికంగా వినియోగిస్తే పంటలో అధిక దిగుబడి సాధించవచ్చు.

– వంగపీటి మోహన్‌రావు, ఏడీ, వ్యవసాయశాఖ, అరకులోయ సబ్ డివిజన్

సమస్యలపై పీవోకు వినతి

గంగవరం : మండల కేంద్రమైన గంగవరం గ్రామ పంచాయతీలో నెలకొన్న పలు సమస్యలను ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం దృష్టికి తీసుకెళ్లినట్టు సర్పంచ్ కలుముల అక్కమ్మ, పీసా గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడు పి.శివరామకృష్ణదొర తెలిపా రు. రంపచోడవరం ఐటిడిఎ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో పీవో సింహాచలంను కలసి సమస్యలు వివరించినట్టు చెప్పారు. స్థానిక పశు వైద్యశాలకు రెగ్యులర్ పశు వైద్యాధికారిని నియమించాలని, పశువైద్యాశాల భవనానికి మరమ్మతు చేసి అభివృద్ధి చేయాలని కోరామన్నా రు. పాత బ్యాంక్ వీధి శివారులో ఉన్న శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని, రహదారి నిర్మాణం, బోర్‌వెల్ ఏర్పాటు చేయాలని కోరినట్లు సర్పంచ్ అక్కమ్మ తెలిపారు. భూపతిపాలెం కెనాల్ ద్వారా ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాలని, గంగవరం - కొమరవరం రహదాని నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని పీవో వినతిపత్రాలు అందజేసినట్టు వారు తెలిపారు.

మొండిగెడ్డలో గ్రామసభ



మాట్లాడుతున్న ఎంపీపీ బోయిన కుమారి

గూడెంకొత్తవీధి: మండలంలోని మొండిగెడ్డలో సోమవారం గ్రామసభ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ బోయిన కుమారి మాట్లాడుతూ అందరు స్నేహంతో, సోదరభావం కలిగి ఉండాలని సూచించారు. పేదలను ఆదుకునేందుకు ముందుకు రావాలని కోరారు. ప్రతీ ఒక్కరు సేవా గుణం కలిగి ఉండి, పేదలకు న్యాయం చేయాలన్నారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

కూటమి నాయకుల వేధింపులు తగవు



తహసీల్దార్ ఆనందరావుకు వినతిపత్రాన్ని ఇస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నయ్యపడాల్

చింతపల్లి: మండలంలో మధ్యాహ్న భోజన కార్మికులను కూటమి నాయకులు వేధిస్తే ఉద్యమించక తప్పదని అల్లూరి జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ హెచ్చరించారు. సోమవారం మండల తహసీల్దారు, విద్యాశాఖ కార్యాలయాలు ముందు ధర్నా కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామ స్థాయిలో ఉన్నటువంటి పాఠశాల కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు మధ్యాహ్న భోజన కార్మికులను రాజకీయంగా వ్యకిగత కక్షలతో వేధింపులకు గురిచేస్తూ తొలగిస్తామని తీర్మాణాలు చేయడం తగదన్నారు. రోజు మధ్యాహ్న భోజన కార్మికులు వంట చేయడానికి కొంతమంది కూటమి నాయకులు ఇబ్బందులకు గురి చేస్తుండడం దారుణమన్నారు. గత కొన్నేళ్లుగా చాలీచాలని వేతనాలతో ఆయా వర్కర్లు విద్యార్థులకు అప్పులు చేసి భోజనాలు అందిస్తున్నారని అలాంటి వారిని వేధించడం దారుణమన్నారు. దీనిపై ఉన్నతాదికారులు చర్యలు చేపట్టకుంటే జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్న భోజన వంటలను బంద్ చేసి కలెక్టర్ కార్యాలయం ముందు ముట్టడి కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దారు ఆనందరావు.ఎంఈవో బోడం నాయుడుకు వినతి పత్రాలను అందించారు.సీఐటీయూ నాయకుడు చిరంజీవి, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పసుపులేటి, లక్ష్మి, మండల అధ్యక్షులు పద్మ, జ్యోతి, సింహాచలం, వెంకటరావు, కార్మికులు పాల్గొన్నారు.

జీపీసీఎంఎస్ బీఎంగా బాబూరావు



తహసీల్దార్ రాజ్‌కుమార్‌ను కలిసిన అరకు కాఫీ అందిస్తున్న బ్రాంచి మేనేజర్ బాబూరావు

జి.మాడుగుల: స్థానిక గిరిజన ప్రైమరీ కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (జీపీసీఎంఎస్)-(జీసీసీ) బ్రాంచి మేనేజర్‌గా సోమవారం జి.బాబూరావు పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీసీసీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామన్నారు. అనంతరం ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లంబోరి అప్పలరాజు, ఎంపీడీవో డేవిడ్‌రాజ్, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఇతర అధికారులను బీఎం మర్యాదపూర్వకంగా కలిసి అరకు కాఫీని అందజేశారు. జీసీసీ సేల్స్‌మెన్ నిరీక్షణరావు, సిబ్బంది సుబ్బారావు, విక్రమ్ తదితరలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం విఫలం



జిసిసి డిఎం కార్యలయం వద్ద ధర్నా చేస్తున్న హమాలీలు

పాడేరు రూరల్: గిరిజన సహకార సంస్థ(జీసీసీ)లో పనిచేస్తున్న హమాలీల సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.పండుబాబు చెప్పారు. గిరిజన సహకార సంస్థ డీఎం కార్యలయం వద్ద అరకులోయ, పాడేరు, చింతపల్లి తదితర ప్రాంతాల్లోని బ్రాంచిల పరిధిలో పని చేస్తున్న జీసీసీ కలాసీలు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా పనిచేస్తున్న హమాలీలకు ఉద్యోగ భద్రత లేదన్నారు. ఇప్పటి వరకు రావల్సిన ఏరియర్స్, 15 నెలల బకాయి నేటికి చెల్లించలేదన్నారు. రాష్ట్రంలో అని బ్రాంచిల్లో పనిచేస్తున్న హమాలీలకు చెల్లించిన్నప్పటికీ గిరిజన ప్రాంతమైన అల్లూరి జిల్లాలో పాడేరు, చింతపల్లి, రంపచోడవరం డివిజన్‌ల పరిధిలో 14 బ్రాంచిల పరిధిలో ఉన్న 280 మందికి హమాలీలకు చెల్లించకుండా ప్రభుత్వం, అధికారులు సవతి తల్లి ప్రేమ చూపించడం తగ్గదన్నారు. పనికి తగ్గ వేతనాలు, లేక కుటుంబాలు పస్తులు ఉండాల్సిన దుస్థితి తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు,. హమాలీలకు యూనిఫాం కుట్టుకూలీ చెల్లించాలని, వివిధ న్యాయమైన డిమాండ్లను తక్షణం పరిష్కరించాలని, లేని పక్షంలో భవిష్యత్‌లో ఉద్యమాలకు పిలుపునిస్తామని ఆయన ప్రభుత్వనికి హెచ్చరించారు. హమాలీల సంఘం నాయకులు బాబూరావు, చందు తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు సూచనలు



వాముగెడ్డ కొత్తూరులో రైతులకు సూచనలిస్తున్న ఏవో మధుసూదనరావు

చింతపల్లి: మండలంలో గిరిజన రైతాంగం మొక్క జొన్న పంటలో తెగుళ్ల నివారణకు చర్యలు పాటిస్తే మంచి దిగుబడులు పొందే అవకాశం ఉంటుందని మండల వ్యవసాయాధికారి టి.మధుసుదనరావు అన్నారు. మండలంలోని చౌడుపల్లిలో రైతు సేవా కేంద్రాన్ని ఆయన సోమవారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతు కార్డుల కోసం వ్యవసాయ, ఉద్యానవన సహాయకులు ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం రైతు క్షేత్రంలో మొక్కజొన్న పంటను పరిశీలించారు. పంటకు కత్తెర పురుగు ఆశించకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ తెగుళ్ల ప్రారంభ దశలో వేప మందు ద్రావణం లీటరు నీటికి 5ఎంఎల్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఉధృతి ఎక్కువగా ఉంటే వ్యవసాయ అధికారులు, సిబ్బంది సూచనలను విధిగా పాటించాలన్నారు. వీహెచ్ఏ పరమేశ్వర రావు, శోభన్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ చట్టాలను పరిరక్షించాలి



కోతులగుట్టలో కొమరం భీమ్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసిన నాయకులు



నల్లకుంటలో మాట్లాడుతున్న దుర్గారెడ్డి

కూనవరం: మండలంలోని కోతులగుట్టలో విశ్వ కోయ భాష వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కుంజా అనిల్, జెట్పీటీసీ సభ్యురావు గుజ్జా విజయ మాట్లాడుతూ ఆదివాసీ చట్టాలకు రక్షణ కరువైందన్నారు. కోయ భాషకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన గుర్తింపు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కోయ భాషకు ప్రభుత్వాలు తగిన గుర్తింపు ఇవ్వడం లేదన్నారు. కోయ భాషకు గుర్తింపు వచ్చే వారకు రాజకీయాలకతీతంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా కొమరం భీమ్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఆదివాసీ టీచర్స్ అసొసియేషన్ జిల్లా కార్యదర్శి అనిల్ కుమార్, మెడికల్ అండ్ హెల్త్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జోగారావు, యువజన నాయకుడు రాజ కుమార్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు ముత్తయ్య, జేఏసీ నాయకులు ముత్తయ్య, వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక: మండంలోని నల్లకుంటలో కోయ భాష దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆదివాసీ ఉద్యోగ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కోశాధికారి ఉమ్మల దుర్గారెడ్డి మాట్లాడుతూ కోయ భాష దినోత్సవాన్ని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని కోరారు. కోయ భాషను పరిరక్షించాలన్నారు. నేతలు శ్రీను, రాంబాబు, నవీన్, భద్రయ్య, జంపన్న, రాజశేఖర్, మహేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మంపై ప్రచారం



ప్రచారంలో అరుణానంద స్వామితో భక్తులు

రాజవొమ్మంగి: సనాతన ధర్మం, హిందువులు అనుసరించాల్సిన పలు అంశాలపై లబ్బర్తి, నెల్లిమెట్ల గ్రామాల్లో సోమవారం విస్తృత ప్రచారం జరిగింది. కంచిపీఠం నుంచి వచ్చిన అరుణానంద స్వామి ఇంటింటికి వెళ్లి రక్షాబంధన కట్టారు. పండ్లు పంపిణీ చేశారు. గృహిణులు పూజల్లో అనుసరించాల్సిన విధానాలను వివరించారు. ఆయనను స్థానికులు సన్మానించారు. దానధర్మ చాలిటబుల్ ట్రస్ట్ సభ్యులు డి.వి.డి.ప్రసాద్, బీజేపీ మండల అధ్యక్షు లు సూరిబాబు, ఉప సర్పంచ్ రాజేశ్వరి, సభ్యు లు రామకృష్ణ, శ్రీనివాస్, రమణ, గోపీ, సుబ్రహ్మణ్యం, సత్యవేణి, రాజు తదతరులు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తల నియామకంపై తీర్మానం



కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు

గూడెంకొత్తవీధి: గూడెం పంచాయతీ అగ్రహారం, రింతాడ పంచాయతీ దుచ్చరిపాలెంకు సంబంధించిన ఆశా కార్యకర్తల పోస్టులకు పంచాయతీ ఎంపిక కమిటీ తీర్మాణాలను జిల్లా వైద్య ఆరోగ్య అధికారులకు సోమవారం పంపారు. గూడెం కొత్తవీధి వైద్యులు అచ్యుతరావు ఆధ్వర్యంలో తీర్మానాలను చేశారు.ఒకో చోట నుంచి ముగ్గురుకు పైబడి దరఖాస్తు చేస్తే వారిలో అర్హులైన ముగ్గురు పేర్లను తీర్మానం ద్వారా డీఎంహెచ్‌వో కార్యాలయానికి పంపాల్సి ఉంది. ఇందులో భాగంగా ఆరోగ్య విస్తరణ అధికారి వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి అరుణ్ కుమార్, సర్పంచ్ బొబ్బిలి లక్ష్మి, మాజీ సర్పంచ్ సాగిను పుష్పకుమారి, ఉప సర్పంచ్ సోమేష్, జోగిపడాల్, పీసా కమిటీ అధ్యక్షులు భీమేశ్వర పడాల్ ద్వారా తీర్మానాలను గ్రామస్తుల ద్వారా చేశారు.

అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళన



అనంతగిరిలో సీడీపీవో సుగుణకు వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు



చీడిపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మించాలని ఆందోళన చేస్తున్న సర్పంచ్, స్థానికులు



ఐసీడీఎస్ కార్యాలయం ఆవరణలో ఆందోళన చేస్తున్న కార్మికులు, నాయకులు



అడ్డతీగలలో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



ముంచంగిపుట్టులో సీడీపీవోకు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నేతలు, అంగన్‌వాడీలు



చింతూరు ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్మికులు

అనంతగిరి(అరకులోయటౌన్): అంగన్వాడీ కేంద్రాల నిర్వహించే టేక్ హూమ్ రేషన్ నిబంధన, ఎఫ్ఆర్‌సీ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. గిరిజన సంఘం , సీఐటీయూ ఇతరత్రా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరార. ఈసందర్భంగా ఆయా కార్మిక, ప్రజాసంఘాల ప్రతినిధులు, నాయకులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు పనిభారం తగ్గించాలని, పనికి తగ్గ వేతనం ఇవ్వాలని, వేధింపులు లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫేస్‌యాప్ వల్ల అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, గర్భిణీలు, బాలింతలు అనేక ఇబ్బందులు పడతున్నారన్నారు. గిరిజన ప్రాంతంలో ఫోన్‌లొ యాప్‌లు పనిచేయక, సిగ్నల్స్ సక్రమంగా లేక సతమతమవుతున్నారన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు అయితేనే సరుకులు వస్తున్నాయని,లేకపోతే సరుకులు రావటం లేదని,ఆన్‌లైన్ ద్వారా పనులు జరగకపోతే అధికారుల నుంచి ఒత్తిడిలు ఎక్కువ అవుతున్నాయన్నారు. ఆన్‌లైన్‌తో సంబంధం లేకుండా సరకులు అందించాలని, కనీస వేతనలు అందజేయాలని ఆయన కోరారు. గతంలో మాదిరిగానే సంతకాలతోనే సరకులు సరఫరా చేసే విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేసారు. అంగన్‌వాడీలకు ఒత్తిడికి గురిచేసి ప్రభుత్వమే ఆటంకాలు కల్గిస్తుందన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలపై సీడీపీవోలు, ఇతర అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అనంతగిరిలో సెక్టార్ అధ్యక్ష, కార్యదర్శులు కళావతి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మండలంలో జరిగిన కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సూర్య నారాయణ, అంగన్‌వాడీ కార్యకర్తలు కొండమ్మ, పవిత్ర, సత్యవతి, రాధ, నీలమ్మ, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలో జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి శంకరరావు, ఈశ్వరి, పార్వతి, సత్యవతి, భవాని, మౌలమ్మ, చిలకమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: బూదరాళ్ల పంచాయతీ చీడిపల్లిలో అంగన్‌వాడీ భవనం నిర్మించాలని కోరుతూ సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ, వార్డు సభ్యులు సంజీవ్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో ఆందోళన నిర్వహించారు.

రాజవొమ్మంగి: మండలంలో జరిగిన కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

చింతూరు: మండలంలో జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి పొడియం లక్ష్మణ్, ఐద్వా మండల అధ్యక్షురాలు మడివి శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు నూకరత్నం, వసంత, స్వరూప, దుర్గ, స్వాతి, కిట్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: మండలంలో జరిగిన కార్యక్రమంలో అంగన్‌వాడీ సంఘం ప్రతినిధి బేబీరాణి, అమ్మని, చంద్రకళ, లక్ష్మి, పార్వతీ తదితరులు పాల్గొన్నారు.

గంగవరం: మండలంలో జరిగిన కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న సర్పంచ్ రామారావు

వి.ఆర్.పురం: పోలవరం నిర్వాసితులకు గృహాల కోసం అధికారులు శ్రద్ధ వహించాలని చిన్నమట్టపల్లి సర్పంచ్ పిట్టా రామారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు తెలిపారు. పార్టీ ముఖ్య కార్యకర్తల సమవేశం చిక్కాల బాలు అధ్యక్షతన సోమవారం రేఖపల్లిలో సమావేశం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వం కోల్పోతున్న పోలవరం నిర్వాసితులు ఎక్కడ కోరుకుంటే అక్కడ పునరావాసం కల్పించాలని కోరారు. అధికారులు దళారుల మాటలను నమ్మి నిర్వాసితులకు మోసం చేస్తున్నారన్నారు. నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్‌సీపీ తరఫున పోరాటం కొనసాగిస్తామన్నారు. ఆర్టీఐ జిల్లా విభాగ అధ్యక్షులు బోడ్డు సత్యనారాయణ , మండల మాజీ కన్వీనర్ పోడియం గోపాల్, పీసా కమిటీ ఉపాధ్యక్షుడు కోటం జయరాజు, ఎస్సీ సెల్ నాయకులు వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు సుబ్రహ్మణ్య హోమం

మునగపాక: మునగపాక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం సుబ్రహ్మణ్య హోమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయ పరిసరాల్లో ఉదయం 8 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో జరిగే హోమలో భక్తులు పాల్గొని స్వామి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాడేరు డివిజన్:
9010234557
Office mail : sakshiadvtvsp@gmail.com